విశాలాంధ్ర
అనకాపల్లి
పేజి నెం. 6
బుధవారం 27, మార్చి, 2024

ఏటికొప్పాక షుగర్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యలపై వినతి

విశాలాంధ్ర - యస్.రాయవరం: ఏటికొప్పాక షుగర్ ఫ్యాక్టరీ సమస్యను పరిష్కరించే విధంగా ప్రధాన పార్టీలు చొరవ చూపాలని పాయకరావుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థులను కార్మిక సంఘ నాయకులు కలిసి అభ్యర్థించారు. మంగళవారం టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి వంగలపూడి అనిత, వైసీపీ అభ్యర్థి కంబాల జోగులను వారు కలిసి మేనిఫెస్టోలోని షుగర్ ఫ్యాక్టరీ తెరిపించే విధంగా పొందుపరిచి కార్మికులతో పాటు రైతుల సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎం.అప్పలరాజు, ఎం.సత్యనారాయణ, కార్మిక సంఘ నాయకులు గుండుబోగుల గోవిందరావు, కే.సత్యనారాయణ, నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే నుండి ఎంపీ స్థాయికి

బూడి అభ్యర్థిత్వాన్ని ప్రకటించిన వైసీపీ అధిష్టానం

విశాలాంధ్ర - కే.కోటపాడు: అనకాపల్లి పార్లమెంటు నియోజకవర్గం నుండి వైసీపీ అభ్యర్థిగా ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు పేరును అనూహ్యంగా అధిష్టానం ప్రకటించింది. వైసీపీ 24 పార్లమెంటు స్థానాలను ప్రకటించి నేటి వరకు అనకాపల్లిని పెండింగ్‌లో పెట్టింది. గత మూడు రోజుల క్రిందట ఉమ్మడి పార్టీల అభ్యర్థి సీఎం రమేష్‌ను ప్రకటించడంతో స్థానికుడు బీసీ వర్గానికి చెందిన బూడిని వైసీపీ రంగంలోకి దించింది. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో కొప్పుల వెలమ సామాజిక వర్గానికి చెందిన వారు అధికంగా ఉండటం, టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి సీఎం రమేష్ కూడా కొప్పుల వెలమ కులానికి చెందిన వ్యక్తి కావడంతో అతనిని ఢీకొట్టాలంటే అదే సామాజిక వర్గానికి చెందిన బూడి ముత్యాల నాయుడును వైసీపీ రంగంలోకి దించింది. అంతేకాకుండా ముత్యాల నాయుడు స్థానికుడన్న ప్రచారంతో ముందుకు పోవచ్చు అన్న అభిప్రాయం పార్టీ వర్గాల్లో ఉంది. ఇక మాడుగుల నియోజకవర్గానికి బూడి కుమార్తె ఈర్లే అనురాధను ఖరారు చేశారు. ఈమె గత ఐదు సంవత్సరాలుగా నియోజకవర్గంలో తండ్రి వెంట తిరుగుతూ అనేక కార్యక్రమాలు నిర్వహించారు. పార్టీ ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో విస్తృతంగా పాల్గొన్నారు. ఉమ్మడి విశాఖ జిల్లా స్త్రీ శిశు సంక్షేమ బోర్డు సభ్యురాలుగా, అనకాపల్లి జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలుగా కొనసాగుతున్నారు. తండ్రి కూతుర్లకు అనూహ్యంగా పార్టీ టికెట్లు ఖరారవడంతో వైసీపీ శ్రేణులు సంబరాలు చేసుకుంటున్నారు.

వేసవిలో తాగునీటి ఎద్దడి
నివారణకు పటిష్ట చర్యలు

కలెక్టరు రవి పట్టన్ శెట్టి

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: వేసవిలో జిల్లాలోనున్న గ్రామాలు, పట్టణాలలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ఎప్పటికప్పుడు పటిష్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టరు రవి పట్టన్ శెట్టి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరు కార్యాలయంలో ఆర్.డబ్ల్యు.ఎస్., గ్రామ పంచాయతీ, పురపాలక, నగరపాలక అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాలు, పట్టణాలలో పరిస్థితులను గమనిస్తూ ఇంజనీరింగు, ఇతర సాంకేతిక సిబ్బందిని అప్రమత్తం చేయాలన్నారు. భూగర్భ జలాల నీటి మట్టాలను అంచనా వేస్తూ తదను గుణంగా కార్యాచరణ ప్రణాళికలను అమలు చేయాలన్నారు. జిల్లాలో మరమ్మతులకు గురైన 51 బోరు బావులను యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేయాలని ఆర్.డబ్ల్యు.ఎస్. అధికారులను ఆదేశించారు. మండల, గ్రామ స్థాయిలో గల వాస్తవ పరిస్థితులను గూర్చి స్థానిక ప్రజా ప్రతినిధుల ద్వారా తెలుసుకోవాలన్నారు. ఈ విషయంలో స్థానిక సంస్థలు తగిన విధంగా స్పందించాలన్నారు. అవసరమయ్యే నీళ్ళ ట్యాంకుల గూర్చి ముందుగానే జాగ్రత్తపడాలన్నారు. నీటి వాడకం, చెరువులు కుంటలను పరిరక్షింకోవడంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ, గ్రామీణ నీటి సరఫరా, విద్యుత్ శాఖ, నర్సీపట్నం, ఎలమంచిలి పురపాలక, అనకాపల్లి జీవీఎంసీ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు, భ్రూణ హత్యలు నేరం

విశాలాంధ్ర - చోడవరం: బాల్య వివాహాలు, భ్రూణ హత్యలు అత్యంత నేరమని రావికమతం ఐ.సి.డి.ఎస్. ప్రాజెక్టు అధికారిణి జి.ఉషారాణి తెలిపారు. మండలంలోని గవరవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం భేటీ బచావో, బేటి పడావో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఐ.సి.డి.ఎస్. పి.ఓ. ఉషారాణి మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండే వరకు వివాహాలు చేయరాదని, బాల్య వివాహాలు నేరమన్నారు. అంతేగాక చిన్న వయసులో పెళ్లి చేయడం వలన అనేక ఆరోగ్య, రక్త హీనత తదితర సమస్యలు తలెత్తుతాయని తెలియజేశారు. అలాగే గర్భిణీలు స్కానింగ్ చేయించినప్పుడు ఆడబిడ్డ అని తెలియగానే అబార్షన్ చేయించి, భ్రూణ హత్యలకు పాల్పడుతున్నారని, ఇది చాలా నేరమని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏసీడివో ఎస్.పుష్ప దేవి, సూపర్వైజర్లు డి. శ్రీదేవి, ఎస్.అనిత, ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది, బాలింతలు, గర్భిణీలు, తదితరులు పాల్గొన్నారు.

మూడు గ్రావెల్ లారీలు పట్టివేత

- విశాలాంధ్ర వార్తకు స్పందన

విశాలాంధ్ర - పరవాడ: ఎటువంటి అనుమతులు లేకుండా గ్రావెల్ తరలిస్తున్న 3 లారీలను మైనింగ్ అధికారులు సోమవారం సీజ్ చేశారు. పెదముషిడివాడలో విచ్చలవిడిగా జరుగుతున్న అక్రమ గ్రావెల్ తవ్వకాలపై విశాలాంధ్ర దిన పత్రికలో 'ఆగని అక్రమ గ్రావెల్ తవ్వకాలు - చోద్యం చూస్తున్న అధికార యంత్రాంగం' శీర్షికతో ఆదివారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఈ మేరకు మైనింగ్ అధికారులు నిఘా పెట్టారు. సోమవారం రాత్రి పెదముషిడివాడ నుంచి తరలించి లంకెలపాలెం ప్రాంతంలో గ్రావెల్ అన్‌లోడ్ చేస్తుండగా అధికారులు 3 లారీలను పట్టుకున్నారు. అయితే ఈ సమాచారం అందుకున్న గ్రావెల్ దొంగలు మరికొన్ని లారీలను మధ్యలో ఈ.మర్రిపాలెం జీడిమామిడి తోటల్లో దాచి పరారైనట్లు తెలుస్తోంది. పట్టుబడ్డ గ్రావెల్ లారీల వద్ద ఎటువంటి బిల్లులు లేకపోవడంతో మైనింగ్ అధికారులు మూడు లారీలను సీజ్ చేసి పరవాడ పోలీసులకు అప్పగించారు. దీనిపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేసి చర్యలు తీసుకుంటామని రాయల్టీ ఇన్‌స్పెక్టర్ స్వాతి తెలిపారు.

350 మందిపై ముందస్తు బైండవర్ కేసులు

విశాలాంధ్ర - కశింకోట: ఎన్నికలు నిర్వహణ సజావుగా సాగడానికి ముందస్తుగా 10 మంది రౌడీ షీటర్లతో కలిపి 350 మందిపై బైండవర్ కేసులు నమోదు చేశామని కశింకోట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వినోద్ బాబు తెలిపారు. కశింకోట పోలీస్ స్టేషన్‌లో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ యువకులు ఈ ఎన్నికల్లో ఎటువంటి వాగ్వివాదాలకు, తగాదాలకు వెళ్లి వారి భవిష్యత్తును పాడుచేసుకోవద్దని యువతకు సూచించారు. ఎన్నికలు నియమావళిని ఏ రాజకీయ పార్టీలు అతిక్రమించినా చర్యలు తప్పవు అన్నారు. ఎన్నికల్లో ఎటువంటి వస్తువులు, నగదు, మద్యం పంపిణీలు జరిగిన సీ విజిల్ యాప్ ద్వారా తెలియపరిస్తే వెంటనే సంబంధిత అధికారులు వెంటనే చర్యలు తీసుకుంటారని అన్నారు. నిరుద్యోగ యువత ఉద్యోగాల కోసం మోసగాళ్ల బారిన పడవద్దని అలాంటి వారి విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. సైబర్ క్రైమ్‌లు ఎక్కువగా జరుగుతున్నాయని వాటి భారిన పడవద్దని ప్రజలను హెచ్చరించారు. అట్టి సమస్య ఎదురైతే ఆలస్యం చేయకుండా 1930కి కాల్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎస్సై రమేష్, పోలీసులు పాల్గొన్నారు.

యువత పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

విశాలాంధ్ర - అచ్యుతాపురం: యువత పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని స్వావలంబ్ భారత్ అభియాన్ ప్రతినిధులు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక క్రైట్స్ డిగ్రీ కాలేజీలో విద్యార్థులతో స్వావలంబ్ భారత్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వావలంబ్ భారత్ జోనల్ ఇన్‌చార్జి అగ్గాల హనుమంతరావు మాట్లాడుతూ యువత స్వయం కృషితో ఉన్నత స్థాయికి ఎదిగి దేశ అభివృద్ధిలో పాలుపంచుకోవాలన్నారు. స్వావలంబ్ భారత్ విశాఖపట్నం కన్వీనర్ వెలగా జగన్నాథ్ మాట్లాడుతూ ప్రస్తుతం భారతదేశ యువత పారిశ్రామిక రంగంలో ఎదిగేందుకు అద్భుత అవకాశాలు ఉన్నాయన్నారు. యువ పారిశ్రామికవేత్త ముత్యాలనాయుడు మాట్లాడుతూ జిఎస్ఎ మొబైల్ ఆక్సిసరీస్ సంస్థను స్థాపించి 20 మంది మహిళలకు ఉపాధి కల్పిస్తున్నానన్నారు. శానిటరీ నాప్కిన్స్ సంస్థని పెట్టి ఎంతో మందికి ఉపాధి ఇస్తున్నానని వ్యాపారవేత్త రోహిణి తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలేజీ మేనేజింగ్ డైరెక్టర్ రెడ్డి చిరంజీవి, ప్రిన్సిపాల్ ఆడారి అప్పలనాయుడు, డైరెక్టర్స్ ఆడారి సన్యాసిరావు, విల్లూరి ప్రసాద్, సరిసా నాగేశ్వరరావు, లెక్చరర్స్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

జనసేన పార్టీలో పలువురు చేరిక

విశాలాంధ్ర - పాయకరావుపేట: పట్టణానికి చెందిన పలువురు కార్యకర్తలు జనసేన పార్టీలో చేరారు. పంచాయతీ మాజీ వార్డు సభ్యురాలు గీసాల పద్మావతి జనసేన పార్టీలో చేరి, ఆమె ఆధ్వర్యంలో పలువురు కార్యకర్తలను పార్టీలో చేర్పించారు. పార్టీలో చేరిన వారికి జనసేన పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ గెడ్డం బుజ్జి పార్టీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా గెడ్డం బుజ్జి మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన, బిజెపి కూటమి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల గెలుపుకు కృషి చేయాలని కోరారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత జనసేన నాయకులు, కార్యకర్తలకు సముచిత స్థానం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గెడ్డం చైతన్య, నానాజీ, ఆచంట దొర, నారపురెడ్డి పద్మావతి, జగ్గన్న దొర, పల్లి దుర్గారావు, మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గెలిచే అభ్యర్థికే టికెట్ ఇవ్వాలి

విశాలాంధ్ర - వి.మాడుగుల: మాడుగుల నియోజకవర్గం టీడీపీ టికెట్‌పై పునరాలోచన చేయాలని గెలిచే అభ్యర్థి గవిరెడ్డి రామానాయుడుకు టికెట్ ఇవ్వాలని మాడుగులలో మంగళవారం నిరసన ర్యాలీ చేపట్టారు. నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ టికెట్ గెలిచే అభ్యర్థికి కాకుండా నాన్ లోకల్ వ్యక్తి కి టికెట్ ఇవ్వడం సరైంది కాదన్నారు. దీనిపై చంద్రబాబునాయుడు పునరాలోచించి మాడుగుల టికెట్ రామానాయుడుకి ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు, కార్యదర్శి, సర్పంచ్, ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, గ్రామ అధ్యక్షులు, కార్యదర్శులు, అనుబంధ సంఘ నాయకులు 29 పంచాయతీల ముఖ్య నాయకులు, క్లస్టర్ యూనిట్, బూత్ ఇంచార్జిలు, మహిళలు, యువత పాల్గొన్నారు.

నూకాంబిక అమ్మవారి జాతరకు ఏర్పాట్లు పూర్తి

ఏప్రిల్ 7 నుంచి మే 7 వరకు జాతర నిర్వహణ

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: ఉత్తరాంధ్ర జిల్లాలో కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా ప్రసిద్ధిగాంచిన అనకాపల్లి శ్రీ నూకాంబిక అమ్మవారి జాతర మహోత్సవానికి ఏర్పాట్లు పూర్తయినట్లు, జాతరను ఏప్రిల్ 7వ తేదీ నుంచి మే 7 వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయంలో మంగళవారం జరిగిన సమన్వయ కమిటీ సమావేశంలో ఆర్డీఓ చిన్ని కృష్ణ తెలిపారు. అమ్మవారి దేవస్థానమునకు అనుసంధానంగా వున్న రోడ్లు ప్రతిరోజు ఉదయం, సాయంత్రం శుభ్రం చేసి వ్యర్థ పదార్థములు ఎప్పటికప్పుడు ట్రాక్టరుపై డంపింగ్ యార్డుకు తరలించడానికి జీవీఎంసీ ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భక్తుల సౌకర్యార్థం తాత్కాలిక మరుగుదొడ్లు, పాడై పోయిన వీధి దీపాల స్థానంలో కొత్తవి ఏర్పాట్లు చెయ్యాలని, దేవస్థానమునకు వచ్చు రోడ్డు మార్గంలో ఇరువైపుల ఆక్రమించిన షాపులను తొలగించాలని సూచించారు. తగినంత పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని, మహిళా, పురుష పోలీసులను ఏర్పాటు చేయాలని సూచించారు. జేబుదొంగలు భారిన పడకుండా ఉండేలా తగిన చర్యలు తీసుకొని, ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. తోటాడ ఆర్చి సెంటర్ నుండి దేవాలయం వరకు, రామాలయం వద్ద గల ఆర్చి గేటు నుండి దేవాలయం వరకు ప్రత్యేక పోలీసు బందోబస్తు ఏర్పాటు చెయ్యాలని ఆదేశించారు. ప్రత్యేకంగా జాతర నెల రోజులు మెడికల్ క్యాంపు నిర్వహించుటకు, అనారోగ్య పరిస్థితులను సరిదిద్దిటకు తగు చర్యలు తీసుకోవాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. జాతరకు వచ్చు భక్తుల సౌకర్యార్థము విశాఖపట్నం, గాజువాక, సింహాచలం, స్టీల్ సిటీ, చోడవరం, విజయనగరం, యలమంచిలి, పాయకరావుపేట మొదలగు డిపోల నుండి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయాలన్నారు. అమ్మవారి జాతర నెల రోజులు జరుగు కార్యక్రమముల వివరములు దూరదర్శన్, ఆకాశవాణి ద్వారా అందరికి తెలిసేలా ప్రచారం చేయాలని సూచించారు. శ్రీ అమవారి దేవస్థానములో పరిసర ప్రాంతములలో మత్తుపానీయలు అమ్మకుండా వాటిని వినియోగించకుండా మొబైల్ పార్టీలను ఏర్పాటు చేసి స్పెషల్ స్క్వాడ్ గస్తీ ఏర్పాటు చేయాలని ఎక్సైజ్ పోలీసులను ఆదేశించారు. అమ్మవారి కొత్త అమావాస్య జాతర మహోత్సవముల నిమిత్తము దర్శనమునకు విచ్చేయు భక్తులకు ఏవిధమైన అసౌకర్యం కలుగకుండా మంచినీరు సరఫరా, క్యూలైన్లు నిర్వహణ పకడ్బందీగా ఉండాలని ఆర్డీఓ చిన్ని కృష్ణ ఆదేశించారు. ఈ సమన్వయ కమిటీ సమావేశంలో సహాయ కమిషనర్, కార్య నిర్వహణ అధికారి బండారి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే జగన్ లక్ష్యం

విశాలాంధ్ర - యస్.రాయవరం: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారని పాయకరావుపేట నియోజకవర్గం వైసీపీ అభ్యర్థి ప్రస్తుత రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. మంగళవారం మండలంలోని జంగులూరు వెలంపాలెం, సైతారు పేట, వేమగిరి, పేట సూదిపురం గ్రామాలలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఐదు సంవత్సరాలుగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఎటువంటి అవినీతి లేకుండా నేరుగా ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడంతోపాటు గ్రామాల్లోని అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం జరిగిందన్నారు. ఇంటింటికి తిరిగి కరపత్రాలను పంచుతూ తమను గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కాకర దేవి, ఎంపీపీ కోన లోవ లక్ష్మి, మండల వైసీపీ అధ్యక్షుడు బొలిశెట్టి గోవిందరావు, మాజీ ఎంపీపీ బొలిశెట్టి శారద కుమారి, వైసీపీ సీనియర్ నాయకులు వీసం రామకృష్ణ, కొణతాల శ్రీనివాసరావు, శ్రీపతి రాజు, అల్లాడ నాగరాజు, అద్దేపల్లి నూకి నాయుడు, పీఏసీఎస్ అధ్యక్షులు రాము రాజు, హనుమంతరావు, మండల వైసీపీ యూత్ అధ్యక్షుడు ఎన్.వెంకట్రాజు సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్

విశాలాంధ్ర - గొలుగొండ: రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు ప్రజలకు అందించారని నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ తెలిపారు. మంగళవారం గొలుగొండ మండలం సిహెచ్ నాగపురం, కుమారపురం గ్రామాల్లో ఎన్నికల ప్రచారంలో పాల్గొనేందుకు వచ్చిన ఎమ్మెల్యేకు మహిళలు హారతులు ఇచ్చి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గణేష్ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో నారా చంద్రబాబు నాయుడు డ్వాక్రా రుణాలు, రైతులకు రుణమాఫీ, నిరుద్యోగులకు ఇంటికొక ఉద్యోగం అని ఉద్యోగం రాని యువకులకు నిరుద్యోగ భృతిని నమ్మబలికి అధికారం చేపట్టి అందరినీ నట్టేట ముంచాడని విమర్శించారు. అదేవిధంగా ఎన్నికలకు ముందు అన్న క్యాంటీన్లను పెట్టి ప్రచారం చేసుకొన్నారు తప్ప పూర్తిస్థాయిలో ఎక్కడ అమలు చేయలేదన్నారు. ప్రస్తుతం నర్సీపట్నంలో నాలుగు నెలలు ముందు నుండి మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు అన్న క్యాంటీన్ నిర్వహిస్తున్నారని ఐదు సంవత్సరాలు ఎందుకు నిర్వహించలేదని ఆయన ప్రశ్నించారు. ఈ సందర్భంగా సిహెచ్ నాగపురంలో టిడిపి పార్టీ నుండి 10 కుటుంబాలు వైసీపీ పార్టీలోకి చేరారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ చిటికెల భాస్కర్ నాయుడు, ఎంపీపీ గజ్జలపు మణికుమారి, జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు, అనకాపల్లి ఎస్సీ సెల్ అధ్యక్షురాలు, ఏఎల్ పురం సర్పంచ్ లోచల సుజాత, వైస్ ఎంపీపీలు జక్కు నాగమణి, సుర్ల ఆదినారాయణ, సిహెచ్ నాగపూర్ సర్పంచ్ రఘురాం, మండల పార్టీ అధ్యక్షులు లెక్కల అప్పలనాయుడు పాల్గొన్నారు.

ఆదరించండి అభివృద్ధి చేసి చూపిస్తా

విశాలాంధ్ర - కోటవురట్ల: ప్రతి ఒక్కరు సైకిల్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపిస్తే గ్రామాల్లో అభివృద్ధి చేసి చూపిస్తానని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వంగలపూడి అనిత అన్నారు. మంగళవారం పాత గొట్టివాడ గ్రామంలో ఎన్నికల ప్రచారం ఆమె నిర్వహించారు. గ్రామంలో వీధి వీధికి కలియతిరిగి మహిళలను, యువకులను, రైతులను కలిసి చంద్రబాబు నాయకత్వాన్ని బలపరచాలని కోరారు. పేద ప్రజల సంక్షేమం అభివృద్ధి కోసం చంద్రబాబు నాయుడు సూపర్ 6 పథకాలను ప్రకటించడం జరిగిందన్నారు. అర్హులందరికీ 4 వేలు పింఛన్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, మూడు గ్యాస్ సిలిండర్లు, నిరుద్యోగ భృతి 3000 వేలు, తల్లికి వందనం ద్వారా కుటుంబంలో ఎంతమంది చదువుకున్న పిల్లలు ఉంటే వారందరికీ ఏడాదికి 15 వేలు రూపాయలు అందించే కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుం దన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల శాఖ అధ్యక్షులు జానకి శ్రీనివాస్ రావు, జనార్ధన్, లింగం నాయుడు, సుంకర బాబ్జి, తిరుమలరావు, బోడ పాలెం సత్తిబాబు, ప్రకాష్, జనసేన మండల పార్టీ అధ్యక్షులు శ్రీను, బిజెపి నాయకులు అప్పారావు, పలువురు తెదేపా నాయకులు, కార్యకర్తలు గ్రామస్తులు పాల్గొన్నారు.

11 మద్యం సీసాలు పట్టివేత: ఎస్ఐ

విశాలాంధ్ర - గొలుగొండ: మండలంలోని ఎర్రవరం గ్రామంలో 11 మద్యం సీసాలను, జోగుంపేటలో ఐదు లీటర్ల సారాను స్వాధీనం చేసుకొని అమరపల్లి వెంకటరమణ, నమ్మాది శ్రీను బాబు అనే వ్యక్తులను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ కృష్ణరావు తెలిపారు. గ్రామాల్లో నాటుసారా మద్యం క్రయ విక్రయాలు జరిపినట్లైతే అలాంటి వ్యక్తులపై కేసులను నమోదు చేయడం జరుగుతుందని ఈ సందర్భంగా ఎస్సై తెలిపారు.

రామరాయుడుపాలెంలో వైసీపీలోకి వలసలు

విశాలాంధ్ర - మాకవరపాలెం: మండలం బూరుగుపాలెం శివారు రామరాయుడుపాలెం గ్రామంలో టీడీపీ నుంచి వైసీపీలోకి 20 కుటుంబాలు చేరాయి. వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఎమ్మెల్యే గణేష్ ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సత్యనారాయణ, మండల వైసీపీ అధ్యక్షులు వాసు, వైసీపీ జిల్లా కార్యదర్శి బొడ్డు గోవిందు, బూరుగుపాలెం వైసీపీ నాయకులు భీమిరెడ్డి గోవింద పాల్గొన్నారు.

టీడీపీ నాయకులు ఇంటింటి ప్రచారం

విశాలాంధ్ర - పాయకరావుపేట: పట్టణంలోని 3వ వార్డులో టీడీపీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన, బిజెపి కూటమి అభ్యర్థి వంగలపూడి అనితకు ఓటు వేసి గెలిపించాలని కోరుతున్నారు. ప్రభుత్వం అధికారంలోకి వస్తే అమలు చేసే సూపర్ సిక్స్ పథకాలకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు పెదిరెడ్డి చిట్టిబాబు, పట్టణ అధ్యక్షులు పెదిరెడ్డి శ్రీను, చింతకాయల రాంబాబు, పెదిరెడ్డి నాగ వెంకటరమణ, జూరెడ్డి ప్రసాద్, గుల్లా నాగరాజు, చిరుకూరి పేర్రాజు, వేములపూడి అప్పారావు, రాజాన ఆది తదితరులు పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రాల తనిఖీ

విశాలాంధ్ర - యస్.రాయవరం: పదో తరగతి పరీక్ష కేంద్రాలను అనకాపల్లి జిల్లా అడిషనల్ ఎస్పీ క్రైమ్ పి.సత్యనారాయణ తనిఖీ చేశారు. ధర్మవరం అగ్రహారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రం వద్ద బందోబస్తు ఎలా ఉన్న దానిపై పరిశీలించడానికి వచ్చినట్లు ఆయన తెలిపారు. ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రతిష్టమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అనంతరం పరీక్షల అధికారులతో మాట్లాడటం జరిగింది. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్సై ఏ.విభూషణరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రచారంలో దూసుకుపోతున్న భరత్

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం అనకాపల్లి మండలంలో గల తంబయ్య పేట, పెద్ద సంపత్ పురం, చిన్న సంపత్ పురం గ్రామాలలో అనకాపల్లి వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్ కుమార్ ఇంటింటికి వెళ్లి రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలు గురించి వివరించారు. మే 13వ తేదీన జరగబోయే ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకే ఓటు వెయ్యాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా అనకాపల్లి వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్ కుమార్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి తన ఐదేళ్ల పాలనలో రాష్ట్రంలోని అర్హులం దరికీ సంక్షేమ పథకాలు అందజేశారని అన్నారు. వైసీపీ ప్రభుత్వంలో కుల, మత రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలను అందిం చడంతో ప్రజల సంపూర్ణ మద్దతు వైసీపీకి ఉందన్నారు. ఈ ప్రచార కార్యక్రమంలో రాష్ట్ర ఇన్ ల్యాండ్ వాటర్ వేస్ అథారిటీ బోర్డు చైర్మన్ దంతులూరి దిలీప్ కుమార్, అనకాపల్లి ఎంపీపీ గొర్లి సూరిబాబు, జిల్లా అధికార ప్రతినిధి మల్ల బుల్లి బాబు, అనకాపల్లి మండల పార్టీ అధ్యక్షులు పెద్దిశెట్టి గోవిందు, అనకాపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు, కసింకోట ఎంపీపీ కలగా లక్ష్మి గున్నయ్య నాయుడు, గంగూపం నాగేశ్వరరావు, మొల్లేటి శివాజీ, నీలకంతం, ఎస్.లక్ష్మి, మత్రిపల్లి శోభ పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

విశాలాంధ్ర - వి.మాడుగుల: ఒరిగి ఉన్న విద్యుత్ స్తంభాలతో ప్రమాదం పొంచి ఉందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మాడుగుల హైస్కూల్ కాలనీ ఆర్అండ్‌బి రోడ్డును ఆనుకొని ఉన్న పాత విద్యుత్ స్తంభం పక్కకు ఒరిగిపోయి ప్రమాదాన్ని పొంచి ఉంది. ఈ రోడ్డు మార్గం గుండా నిత్యం ఆర్టీసి బస్సులు, కార్లు ద్విచక్ర వాహనాలు తదితర వాహనాలు తిరుగుంటాయి. వందలాది మంది నిత్యం ప్రయాణిస్తుంటారు. అయితే ఎన్నో ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన ఈ విద్యుత్ స్తంభం పక్కకు ఒరిగిపోయి గాలులు వీస్తే నేలను తాకే ప్రమాదం ఉంది. ఈ స్తంభానికి పలు వీధులకు విద్యుత్ సరఫరా చేసే విద్యుత్ తీగలు ఉన్నాయి. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై విద్యుత్ శాఖ అధికారులకు సిబ్బందికి సమస్యను వివరించినా పట్టించుకోలేదని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మూడు లక్షల 30 వేల నగదు పట్టివేత

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: ఎన్నికల విధుల్లో భాగంగా ఫ్లేయింగ్ స్క్వాడ్ తనిఖీలలో 3 లక్షల 30 వేల నగదు పట్టుబడినట్లు రూరల్ ఎస్సై తెలిపారు. మండలంలోని కోడూరు ప్రధాన రహదారి వద్ద ఫ్లయింగ్ స్క్వాడ్ నిర్వహించే సాధారణ తనిఖీల్లో భాగంగా కోడూరు నుంచి సిహెచ్ న్ అగ్రహారం వైపు బైక్ పై వెళుతున్న సి.హెచ్. శ్రీనివాసరావు ఫ్లయింగ్ స్క్వాడును చూసి వెనక్కి తిప్పి వెళ్ళిపోతుండగా అనుమానం వచ్చిన ఫ్లయింగ్ స్క్వాడ్ ఇన్చార్జ్‌బి2 ఎల్. ఏ. భాగ్యలక్ష్మి సిబ్బందిని అప్రమత్తం చేయగా బైకులు అదుపులోకి తీసుకొని తనిఖీ చేయగా ఇటువంటి రసీదులు లేకుండా తరలిస్తున్న మూడు లక్షల 30 వేల నగదును గుర్తించి సీజ్ చేసినట్లు తెలిపారు. ఫ్లయింగ్ స్క్వాడ్ ఇంచార్జ్ భాగ్యలక్ష్మి ఇచ్చిన రిపోర్ట్ ఆధారంగా కేసు నమోదు చేశామని తెలిపారు. నగదుకు సంబంధించి బిల్లులు, రసీదులు ఉంటే మండల ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ (ఎమ్మార్వో) దగ్గర చూపించి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ తీసుకువస్తే నగదును అప్పగిస్తామని ఎస్సై తెలిపారు.

ఏప్రిల్ 11న మత్స్య నారాయణ జయంతి

విశాలంధ్ర - అచ్యుతాపురం: ఏప్రిల్ 11న మత్స్య నారాయణ జయంతిని రాజకీయ పార్టీలకతీంగా మత్స్యకారులంతా కలిసి జరుపుకోవాలని మత్స్యకార సంక్షేమ సమితి రాష్ట్ర అధ్యక్షులు ఉమ్మిడి మహేష్ అన్నారు. మంగళవారం మండలంలో మత్స్యకార గ్రామమైన పూడిమడకలో పర్యటించిన ఆయన మత్స్యకారుల సమస్యలను, ప్రభుత్వం అందిస్తున్న పథకాలను అడిగి తెలుసుకున్నారు. వేట నిషేధం అనంతరం గ్రామస్తులంతా కలిసి గంగా హారతి ఇవ్వాలని కోరారు. మత్స్యకార సంక్షేమ సమితి 9 అంశాలపై పనిచేస్తుందని వచ్చే ఎన్నికల్లో ఎటువంటి గొడవలు లేకుండా నడుచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కదిరి గుర్నాథం, మేరుగు బాపయ్య, చోడిపల్లి పెంటయ్య, ఎరిపల్లి బాపునాయుడు , సురాడ సత్తిబాబు , సురాడ నూకరాజు, గగన్ , మేరుగు నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు జీడితోట దగ్ధం

విశాలాంధ్ర - వి.మాడుగుల: మాడుగుల మండలం జాలంపల్లి పంచాయతీ గొప్పూరు గ్రామం కురచా పంటారావు, బోయిన గుందిరాజులకు చెందిన ఐదు ఎకరాల జీడితోట ప్రమాదవశాత్తు కాలిపోయింది. దీంతో లక్ష రూపాయల వరకు ఆస్తి నష్టం సంభవించింది. వీరు నిరుపేద కుటుంబం ఎస్టి కులాల వారు వీరికి ఆర్థికంగా చేయూతను అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. దీనిపై హార్టికల్చర్, అగ్రికల్చర్ డిపార్ట్మెంట్ వాళ్లు స్పందించి పరిశీలన జరిపి వారికి ఆర్థికంగా న్యాయం చేయాల్సిందిగా కోరారు.

స్వయంభూ గంగా సమేత గౌరీశ్వరుని హుండీ లెక్కింపు

విశాలాంధ్ర - చోడవరం: రాష్ట్రంలో స్వయంభు గౌరీశ్వర స్వామి దేవాలయాల్లో అత్యంత పురాణ ప్రసిద్ధి చెందిన చోడవరం గంగా సమేత పురాణ గౌరీశ్వర స్వామి దేవస్థానం హుండీ లెక్కింపు జరిగింది. మహా శివరాత్రి అనంతరం, మంగళవారం, దేవాదాయ ధర్మాదాయ, అనకాపల్లి శాఖ తనిఖీదారు ఎం.శ్రీధర్ పర్యవేక్షణలో దేవస్థాన అర్చకులు, శ్రీ స్వామి వారి భక్తులచే 02 హుండీలను తెరచి లెక్కించినట్లు ఆలయ కార్య నిర్వహణాదికారి ఎస్.వి.వి.సత్యనారాయణ మూర్తి తెలిపారు. ఫిబ్రవరి 27 నుండి హుండీలో నిల్వ వున్న నగదు రూ. 83,822/-లు ఆదాయం, మరియు శ్రీ స్వామి వారి మహాశివరాత్రి దర్శనం టిక్కెట్లు అమ్మకం ద్వారా రూ.18,910/-లు ఆదాయం వచ్చినదని, మొత్తం రెండింటి ఆదాయాలు కలిపి రూ.1,02,732/-లు ఆదాయం వచ్చిందన్నారు.

గంగాదేవి పండగలో పైలా

విశాలాంధ్ర - కె.కోటపాడు: మండలం కెజె పురం గ్రామంలో గంగాదేవి తల్లి గావు పండగ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక టీడీపీ నాయకులుతో కలిసి పూజా కార్యక్రమంలో మాడుగుల నియోజకవర్గం టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీ ఉమ్మడి ఎమ్మెల్యే పైలా ప్రసాదరావు పాల్గొన్నారు. అమ్మవారికి పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు తీసుకున్నారు. ప్రసాద్‌తో పాటు గ్రామ టీడీపీ పార్టీ అధ్యక్షులు రెడ్డి సూర్యనారాయణ, గ్రామ సర్పంచ్, నియోజకవర్గం తెలుగు యువత అధ్యక్షులు ఎడ్ల రమేష్, వైస్ సర్పంచ్ గొర్లి అప్పారావు, మాజీ సర్పంచ్ ఎడ్ల తాతబాబు, యువత అధ్యక్షులు రాజు, యాదవ సంఘం అధ్యక్షులు గుంపాన గంగరాజు, రెడ్డి అప్పలనాయుడు, కొలమంచిలి రమేష్, మేడిచర్ల సర్పంచ్, యూనిట్ ఇన్‌చార్జి పూడి నారాయణమూర్తి, అనకాపల్లి పార్లమెంటరీ తెలుగు యువత ఆర్గనైసింగ్ సెక్రటరీ పూడి శ్రీను, ఎ.కోడూరు సర్పంచ్ బొడ్డు అక్కునాయుడు, సింగన్నదొరపాలెం సర్పంచ్ వెలగల పైడం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి లభ్యం

విశాలాంధ్ర - కే.కోటపాడు: తమిళనాడు రాష్ట్రానికి చెందిన వ్యక్తి గంజాయి తీసుకువస్తుండగా స్థానిక పోలీసులు పట్టుకున్నట్లు కే.కోటపాడు ఎస్సై లక్ష్మీనారాయణ తెలిపారు. కోయంబత్తూర్‌కు చెందిన కే.కార్తీక్ (26) మంగళవారం తెల్లవారుజామున పాడేరులో నాలుగు కేజీల గంజాయి కొనుక్కొని వస్తుండగా కే.కోటపాడు సమీపంలో పట్టుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

15 మద్యం సీసాలు స్వాధీనం

విశాలాంధ్ర - పరవాడ: అక్రమంగా మద్యం కలిగి ఉన్న ఇద్దరు వ్యక్తులపై పరవాడ పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. సీఐ ఎస్.బాల సూర్యారావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పరవాడ గ్రామానికి చెందిన దొడ్డి యశోదకృష్ణ అనే వ్యక్తి ప్రభుత్వ మద్యం దుకాణం వద్ద మద్యం కొనుగోలు చేసి తీసుకు వెళ్తుండగా మార్గం మధ్యలో సీఐ బాల సూర్యారావు తనిఖీలు చేసి రూ.1530 విలువ గల 10 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. అలాగే తానాం గ్రామంలో అల్లు లక్ష్మణరావుకు చెందిన పాన్ షాపులో తనిఖీలు నిర్వహించగా రూ.765 విలువ చేసే 5 మద్యం సీసాలు పట్టుబడ్డాయి. రెండు చోట్ల పట్టు బడ్డ మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని వారిద్దరిపై పోలీసులు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

10 లీటర్ల సారాతో మహిళ అరెస్టు

ఎస్ఐ ఎం.ఉపేంద్ర

విశాలాంధ్ర - గొలుగొండ: కొయ్యూరు మండలం రత్నంపేట జంక్షన్‌లో 10 లీటర్ల నాటు సారాతో కొయ్యూరు మండలం రత్నంపేట గ్రామానికి చెందిన పప్పుల జ్యోతి అనే మహిళను అరెస్టు చేసినట్లు ఎస్ఐ ఎం.ఉపేంద్ర మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొంగ సింగి రహదారిలో రత్నంపేట జంక్షన్ వద్ద తన సిబ్బందితో ఆ మహిళలను అరెస్టు చేయడం జరిగిందని ఈ సందర్భంగా ఎస్ఐ తెలిపారు.

అభివృద్ధిని గాలికొదిలేసిన వైసీపీ

కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కొణతాల

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: వైసీపీ ప్రభుత్వం అభివృద్ధిని గాలికి వదిలేసిందని కూటమి ఉమ్మడి అభ్యర్థి కొణతాల రామకృష్ణ ఆరోపించారు. కాఫీ విత్ కేడర్‌లో భాగంగా మూడోరోజు మంగళవారం కోట్నివీధి, మళ్ళవీధి కల్యాణ మండపాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దోపిడీ కక్ష సాధింపులు తప్ప వైసీపీ ప్రభుత్వం ప్రజలకు చేసింది ఏమీ లేదని ఆరోపించారు. మొదటిగా స్వర్గీయ ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రోడ్లు, డ్రైనేజీ వంటి ముఖ్యమైన పనులను పట్టించుకోలేదన్నారు. ఉమ్మడి ప్రభుత్వం రాగానే ప్రజలకు అవసరమైన అభివృద్ధి చేసి చూపిస్తామన్నారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను ఆపాల్సిన అవసరం ఉందన్నారు. 8 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే సృజల స్రవంతి పూర్తి చేయడం తన ముందున్న ప్రధాన లక్ష్యమన్నారు. చెల్లెలికి తల్లికి న్యాయం చేయలేని ముఖ్యమంత్రి ఆడబిడ్డలకు ఏమి న్యాయం చేస్తారని ప్రశ్నించారు. రైతుల ప్రయోజనాలను కాపాడే ప్రభుత్వం రాబోతుందని అన్నారు. కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడం వల్ల ఎవరు పనులు చేపట్టేందుకు ముందుకు రావడం లేదన్నారు. వ్యాయామశాల ఏర్పాటు చేయాలని యువకులు కోరారు. పొలాల్లోకి వెళ్ళేందుకు రోడ్లు వేయాలని పలువురు రైతులు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం ఫీజులు సకాలంలో చెల్లించకపోవడం వలన చదువు పూర్తైనా సర్టిఫికెట్లు ఇవ్వలేదని తమ సమస్యలు చెప్పుకున్నారన్నారు. మాజీ ఎమ్మెల్సీ, అనకాపల్లి టీడీపీ జిల్లా అధ్యక్షులు బుద్ధ నాగ జగదీష్, మాజీ శాసనసభ్యులు పీలా గోవింద సత్యనారాయణ, టీడీపీ టౌన్ ప్రెసిడెంట్ డా. నారాయణరావు, బీజేపీ నాయకులు గేదెల స్వరూప్, 84వ వార్డు కార్పొరేటర్ మాదంశెట్టి నీలబాబు పాల్గొన్నారు.

అర్చక, పురోహితులపై దాడి చేసిన వారిని శిక్షించాలి



విశాలాంధ్ర - చోడవరం: కాకినాడ జిల్లా, కాకినాడ పట్టణంలోని దేవాలయం వీధి శివాలయంలో అర్చకులుగా పని చేస్తున్న సాయి శర్మ, విజయ కుమార్ శర్మలపై ఆలయంలో, భక్తుల మధ్యలో దాడికి పాల్పడడమే కాకుండా, ఆ అర్చకుల పై కాళ్లతో దాడి చేసి, గాయపరిచిన మాజీ కార్పొరేటర్ సిరియాల చంద్రరావు పై కేసు నమోదు చేసి, తక్షణమే అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని, అర్చకులకు రక్షణ కల్పించాలని అనకాపల్లి జిల్లా, చోడవరం శ్రీ గణేష్ గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం డిమాండ్ చేస్తోంది. అర్చకులు, దేవాలయ పూజారులుపై జరిగిన దాడులను ఖండిస్తూ గణేష్ గాయత్రి బ్రాహ్మణ సేవా ట్రస్ట్ గౌరవ అధ్యక్షులు కందర్ప కృష్ణ మూర్తి (కిష్టప్ప), ప్రముఖ న్యాయవాది కందర్ప రామేశం (రమేష్), అధ్యక్షుడు పుత్రేవు శ్యాం ప్రసాద్, కార్యదర్శి వింజమూరి శంకర్ లు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. దేవాలయం అర్చకుల పై దాడులకు పాల్పడిన వారిని, అసాంఘిక కార్యకలాపాలకు రక్షణగా ఉన్నటువంటి అధికార ప్రభుత్వ పెద్దలపైన కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. గత కొంతకాలంగా దేవాలయాల పైన అర్చక పురోహితులు, బ్రాహ్మణులు పైన నిరంతరం దాడులు జరుగుతున్నాయని, ఇది చాలా విచారకరమైనటువంటి విషయమని వారు తెలిపారు. ఇలాంటి దాడులకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించి, అర్చకుల పైన పురోహితులు, బ్రాహ్మణులు, వారి ఆడపిల్లల పైన దాడులకు పాల్పడిన వారు ఎంతటి వారైనను, వారిపై పోలీస్ కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని, ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా చూడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం నిందితులను అరెస్టు చేయకపోయినా, ఈ సంఘటనపై ఎటువంటి క్రమ శిక్షణ చర్యలు చేపట్టకపోయినను, ఏ.పి.ప్రైవేట్ అర్చక పురోహిత సంక్షేమ సంఘం తరపున ప్రత్యక్ష పోరాటానికి మద్దతు ఇచ్చి, ఉవ్వెత్తున ఉద్యమిస్తామని, తదుపరి చర్యలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని వారు కోరుతున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోని అన్ని బ్రాహ్మణ సంఘాలు అర్చక, పురోహిత, బ్రాహ్మణుల ఉద్యమానికి మద్దతు ఇచ్చి, వారి పై దాడులను ఖండించాలని, శ్రీ గణేష్ గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం కోరుతుంది. ఈ కార్యక్రమంలో కందర్ప సత్యనారాయణ మూర్తి, కొమ్మనమంచి నరసింహ మూర్తి, ఉపాధ్యాయుల శ్రీనివాసరావు, ట్రస్ట్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

వాలంటీర్లంటే కూటమికి ఎందుకంత భయం

విశాలాంధ్ర - చోడవరం: వాలంటీర్లు అంటే టి.డి.పి. కూటమికి ఎందుకంత భయమని చోడవరం తాజా మాజీ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ కరణం ధర్మ శ్రీ ప్రశ్నించారు. స్థానిక వై.సి.పి. క్యాంప్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు, దత్తపుత్రుడు పవన్‌కు ఎందుకంత భయం అని, వాలంటీర్లను కించపరచడం తగునా అంటూ ధర్మశ్రీ ప్రశ్నించారు. నియోజకవర్గ పార్టీ పరిశీలకులు బొడ్డేటి కాశీ విశ్వనాథ్‌తో కలసి మాట్లాడారు. వాలంటీర్లను చూస్తే చంద్రబాబుతో పాటు తెలుగుదేశం పార్టీ నేతల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయని కాబట్టే వాలంటీర్లపై చంద్రబాబునాయుడు, ఆ పార్టీ నేతలతో పాటు దత్తపుత్రుడి నోట్లో నుంచి కించపరిచే మాటలు వినపడుతున్నాయని మండిపడ్డారు. వాలంటీర్లంటే గౌరవ భృతి తో కలిసి పనిచేసే స్వచ్ఛంధ సేవకులు అని, ప్రజలకు సేవ చేస్తున్న వారిపై కక్ష్య సాధింపు తగదన్నారు. మహిళల అదృశ్యానికి, ప్రజలు గెద్ద కాళ్ల కింద కోడిపిల్లల్లా అల్లాడిపోతున్నారని వాలంటీర్లను బహిరంగంగా కించపరచడం వారి నైజానికి నిదర్శనం అని తెలిపారు. తమకు అధికారం ఇస్తే వాలంటీర్ల వ్యవస్థ నడుం విరగ్గొడతాను అని చెప్పడం వెనుక వాలంటరీ వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేస్తామని చెప్పకనే చెబుతున్నారని అన్నారు. అలాగే తాము అధికారంలోకి వచ్చిన తర్వాత వాలంటీర్ల కథ తేలుస్తాం అని బెదిరింపులకు దిగుతున్నారని, విపక్షాల జేబులు నిండడం లేదు కాబట్టే వారి కడుపులు మండుతున్నాయని మండిపడ్డారు. వాలంటీర్లపై అత్యంత నీచమైన వ్యాఖ్యలు చేసిన తెలుగుదేశం పార్టీ నేతలు, తమ వ్యాఖ్యలను వెనక్కితీసుకోవడంతో పాటు వాలంటీర్లకు బహిరంగ క్షమాపణ చెప్పాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున ఎమ్మెల్యే డిమాండ్ చేస్తున్నారు. ఈ సమావేశంలో వైసిపి నాయకులు, రైల్వే బోర్డు సభ్యులు బొడ్డు శ్రీరామమూర్తి, జిల్లా వైసీపీ మహిళా విభాగం ప్రతినిధి బగ్గు శ్యామల , టెలికం డైరెక్టర్ వేచలపు ప్రకాష్, మాజీ జడ్పిటిసి బి. సూర్యనారాయణ, మాజీ సర్పంచ్ మొల్లి సోమనాయుడు పాల్గొన్నారు.

భరత్ కుమార్ ఎన్నికల ప్రచారానికి విశేష స్పందన

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: మండలంలో మార్టూరు గ్రామంలో అనకాపల్లి నియోజకవర్గం వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్ కుమార్ వారి సతీమణి నివేదిత ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గడపగడపకు వెళ్లి రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చేస్తున్న అభివృద్ధి గురించి వివరిస్తూ మీ అమూల్యమైన రెండు ఓట్లను ఫ్యాన్ గుర్తుపై వేసి తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా భరత్ కుమార్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్లో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పేదలకు ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని అన్నారు. గడపగడపకు వెళ్తున్నప్పుడు స్వయంగా ప్రజలే మాకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెడుతున్న పథకాలన్నీ అందుతున్నాయని రాబోయే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి మిమ్మల్ని అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామని అనడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. ఈ ప్రచార కార్యక్రమంలో అనకాపల్లి మండల పార్టీ అధ్యక్షులు పెద్దిశెట్టి గోవింద్, గంగుపం నాగేశ్వరరావు,యల్లపు రమేష్,మత్రిపల్లి శోభ, గొల్లవిల్లి కృష్ణ, నీలకంతం లక్ష్మి ,పచ్చడి పద్మ, సర్పంచ్ కరణం రెవిన్యూ నాయుడు, ఎంపీటీసీ మిద్దె రాజాచంద్రరావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఒమ్మి మధు, మిద్దె హేమ సుందర్, మాజీ సర్పంచ్ కరణం కృష్ణ, వైస్ సర్పంచ్ బేత ప్రవీణ్, స్కూల్ చైర్మన్ దంట్ల ప్రకాశరావు, మండే సోమనాయుడు, కరణం శివ, కొలిమెర్ల గోవింద్, పల్లేల సాయికిరణ్, పెద్ద ఎత్తున మహిళలు, వైఎస్ఆర్సీపి నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రామ దేవతల పండగలు

- వేలాదిగా తరలి వచ్చిన భక్తులు

విశాలాంధ్ర - పరవాడ: మండలంలో గ్రామ దేవతల పండగలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. పరవాడలో పైడిమాంబ, తానాంలో పరదేశిమాంబ, వాడచీపురుపల్లి, నాయుడుపాలెం పంచాయితీల్లో ముత్యాలమ్మ తల్లి, దేశపాత్రునిపాలెం, జాజులవానిపాలెం గ్రామాల్లో పోలమాంబ అమ్మవారి పండగలను నిర్వహించారు. పరవాడలో సోమవారం అర్ధరాత్రి దాటాక పైడిమాంబ అమ్మవారి దర్శనాలు ప్రారంభమయ్యాయి. వేలాది మంది భక్తులు దర్శించుకుని అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. పరదేశీ మాంబ, ముత్యాలమ్మ తల్లి, పోలమాంబ అమ్మవార్ల దర్శనానికి భక్తులు బారులు తీరారు. అమ్మవార్లకు పసుపు కుంకుమలు సమర్పించి ముక్కులు తీర్చుకున్నారు. మాజీ ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు తదితరులు ఆయా గ్రామ దేవతలను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాల వద్ద భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేసారు. తాగునీరు సరఫరా,ఉచిత ప్రసాదాలు పంపిణీ చేసారు. సాయంత్రం అమ్మవార్ల ఘటాలను గ్రామాల్లో ఊరేగించిన అనంతరం ఆలయాల వద్ద అనుపోత్సవం చేసారు. ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో రాత్రికి ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేకంగా అకట్టుకున్నాయి.

బూడిని అనకాపల్లి ఎంపీ అభ్యర్థిగా ప్రకటించడంపై హర్షం

విశాలాంధ్ర - కె.కోటపాడు: కొంత కాలంగా అనూహ్య పరిణామాల మధ్య కొనసాగుతున్న అనకాపల్లి వైసీపీ అభ్యర్థి లోక్ సభ స్థానాన్ని ఎట్టకేలకు వైసీపీ అధిష్టానం వెల్లడించింది. ఈ స్థానానికి దేవరాపల్లి మండలం తారువ గ్రామానికి చెందిన బూడి ముత్యాలనాయుడుకి కేటాయించారు. ప్రస్తుతం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. బూడి ముత్యాలనాయుడు పేరు ఖరారు చేసిన అనంతరం పార్టీ శ్రేణులు తారువ గ్రామంలో సంబరాలు చేశారు. ముత్యాల నాయుడు చేసిన శ్రమకు సముచిత స్థానం దక్కిందని ప్రజా పాలన అందించిన ప్రభుత్వం తమదని, వైసిపి ప్రభుత్వం సంక్షేమానికి, అభివృధికి చిరునామా గా నిలిచిందని, పెత్తం దారులకు, పేదవారికి జరిగే ప్రజా సంగ్రామంలో ప్రజల ద్వారా దేవుడు అందించబోయే గెలుపు ఊరక నిలిచి చూడడమే తరువాయి అని పార్టీ శ్రేణులు తెలిపారు.వార్డు మెంబర్ స్థాయి నుండి ఉపసర్పంచ్, సర్పంచ్, ఎంపీటీసీ, ఎంపీపీ, జడ్పిటిసి, ఎమ్మెల్యే, విప్ గాను ఉప ముఖ్యమంత్రిగా విశిష్ట సేవలు అందించారు. మంత్రి అయ్యాక మాడుగుల నియోజకవర్గంలో ఎనలేని అభివృద్ధి చేసి నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉన్నారు. అలాగే బూడి ముత్యాలనాయుడు తనయ ఈర్లే అనురాధ ప్రస్తుతం కే.కోటపాడు జడ్పిటిసిగా, అనకాపల్లి జిల్లా వైసీపీ మహిళా విభాగం అధ్యక్షురాలుగా, ఉమ్మడి విశాఖ జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ స్టాండింగ్ కమిటీ చైర్పర్సన్ గాను, నిరంతరం తండ్రి అడుగుజాడల్లో నడుస్తూ ప్రజా సేవలో ఉన్నారు.